
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 67 వ భాగం

### అజామీళోపాఖ్యానం – 2

### పాపం, పుణ్యం సమాంతర రేఖలు

పాప పుణ్యాల గురించి అడుగుతూ, చేసిన పాపమే మళ్ళీ చేస్తూ ఎప్పటికీ విడిపించుకోలేని జనన మరణ చక్రంలో కూరుకుపోతున్న మానవుడికి అసలు తరుణోపాయం అనేది ఉందా, ఒకసారి పాపం చేస్తే మరో పుణ్యం చేసి ఆ పాపాన్ని కడిగేసుకోవడం కుదురుతుందా అని పరీక్షిత్తు భాగవతం వింటూ అడిగాడని క్రితం వ్యాసంలో చూసాం. దానికి ఇప్పుడు శుకమహర్షి సమాధానం చెప్తున్నాడు.

క. కర్మము కర్మముచేతను
నిర్మూలము గాదు తెలియనేరక తా నే
కర్మము జేసినఁ దత్ప్రతి
కర్మం బొనరింప వలయుఁ గలుషవిదూరా! [6-48]

ఒక కర్మ మరో కర్మ వల్ల నిర్మూలం అవుతుందనే ప్రశ్న లేదు. దేని దారి దానిదే. ఏదైనా పాప కర్మ చేస్తే దానికి పశ్చాత్తాపంతో దానికి విరుగుడు (తత్ప్రతి) చేసుకోవాలి. అంతేకానీ ఋణ సంబంధమైన కర్మకీ ధనసంబంధమైన కర్మకీ ఒకటికొకటి విరుగుడు కాదు. అంటే చిత్రగుప్తులవారి చిట్టాలో పాపపుణ్యాలు వేరువేరుగా రాయబడతాయి. ఆ రెండూ దేనికవి విడివిడిగా అనుభవించవలసిందే.

ఒకటి గమనించాలి. ఈ జీవితంలో ఏదో చెడు జరిగినదనుకుందాం. దానికి, నాకిలా అయింది, నన్ను దేవుడు పట్టించుకోడు, భగవంతుడు నాకిలా చేసాడు, అసలు దేవుడే లేడు అని అనుకోవడం మంచిదేనా? కాస్త ఆలోచిస్తే మనకి విశదం అయ్యేదేమిటంటే, ఏదో జన్మలో మనం ఒక కర్మ చేసాం అది మనకి క్రితం వ్యాసంలో చెప్పినట్టూ, యధా ధేను సహస్రేషు ... అన్నట్టూ అంటుకుని ఇప్పుడు దాని ఫలితం అనుభవిస్తున్నాం, ఇందులోకి, మన కర్మలని చూస్తూ సాక్షిగా ఉన్న భగవంతుణ్ణి ఎందుకు లాగడం? ఇప్పుడు మనం చేయవల్సినది ఏమిటంటే మరో సారి అటువంటి కర్మ చేయకపోవడం, ఆ కర్మ ఒకసారి చేసినందుకు ప్రాయశ్చిత్తం చేసుకోవడం.

క. హితవు గల కుడుపు మఱి రు
గ్వితతులఁ బొడమంగ నీని విధమున నతి స
ద్వ్రతుఁ డైనవాఁడు నిర్మల
మతిచే నఘరాశి నెల్ల మట్టము జేయున్. [6-49]

పెద్దలు చెప్పినట్టుగా సత్ప్రవర్తన అలవరచుకున్నవాడు నిర్మల మైన హృదయంతో పాపాలని నివృత్తి చేసుకోవచ్చు. మరి ఈ సద్వర్తన ఎలా, వేటితో అలవర్చుకోవాలి?

చ. తపమున బ్రహ్మచర్యమున దానమునన్ శమ సద్దమంబులన్
జపమున సత్యశౌచముల సన్నియమాది యమంబులం గృపా
నిపుణులు ధర్మవర్తనులు నిక్కము హృత్తను వాక్యజంపు పా
పపుగురిఁ ద్రుంతు రగ్ని శతపర్వ వనంబుల నేర్చుకైవడిన్. [6-50]

తపస్సు, బ్రహ్మచర్యం, దానం, శమ దమాదులు, జపం, సత్యం శౌచం, యమ, నియమాలతో ఉన్న ధర్మవర్తనులు ఈ మనసులో (హృత్) పాపాలని శరీరంతో (తను) చేసిన త్రుంచుకోగలరు. ఎలాగంటే అగ్ని వెదురు (శతపర్వ) వనాలని దహించినట్టుగా. కొంచెం ఆలోచిస్తే మనకి తెలిసేది ఏమిటంటే ఈ తపస్సు, బ్రహ్మచర్యం, దానం, శమ దమాదులు, జపం, సత్యం శౌచం, యమ, నియమాలతో ఉన్నవాడి మనస్సు, శరీరం ఎక్కడుంటాయి నిరంతరం? భగవంతుడిమీద. ప్రపంచాన్ని వదిలేసి సర్వకాల సర్వావ్యవస్థల్లో కూడా భగవంతుడి మీద ధ్యాస ఉండేవాడికి పాపం చేయడానికి ఆస్కారమే లేదు కదా? మరి ఇప్పుడు అందరికీ ఇలా కుదురుతుందా అనే ప్రశ్న వస్తుంది కనక ఇంకా చెప్తున్నాడు – వేరే దార్లు ఉన్నాయి ఇంకా.

ఉ. కొందఱు పుణ్యవర్తనులు గోపకుమార పదారవింద జా
నంద మరందపాన కలనారత షట్పదచిత్తు లౌచు గో
వింద పరాయణుల్ విమలవేషులు దోష మడంతు రాత్మలం
జెందిన భక్తిచేత రవి చేకొని మంచు నడంచు కైవడిన్. [6-52]

ఇంకా కొంతమంది పుణ్యవర్తనులున్నారు. వాళ్లకి కృష్ణుడి పాదారవిందాలమీద తప్ప మరోచోట మనసు నిలవదు. వీళ్ళు మనసులో భగవంతుణ్ణి నిరంతరం తలుచుకుంటూ, ఉదయించే సూర్యుడు మంచుని కరిగించినట్టూ (రవి చేకొని మంచు నడంచు కైవడిన్), తమ భక్తిచేత పాపాలకి దూరంగా ఉంటారు.

క. హరిభక్తిచేతఁ గొందఱు
పరిమార్తురు మొదలుముట్ట పాపంబుల ని
ష్ఠురతర కరముల సూర్యుం
డరుదుగఁ బెనుమంచుఁ బించ మడఁచిన భంగిన్. [6-53]

హరిమీద భక్తి చేత కొంతమంది తమ కర్మలని సమూలంగా నాశనం చేసుకోగల్గుతున్నారు. మరి ఆ భక్తి ఎలా వస్తుంది అందరికీ? అది ముందు పద్యంలో చెప్పినట్టూ తపమున బ్రహ్మచర్యమున దానమునన్ శమ సద్దమంబులన్.. అలవర్చుకోవాలి. లేకపోతే ఏదో పూర్వజన్మలో చేసిన మంచి వల్ల ఈ జన్మలో శ్రీహరి భక్తి కలగవచ్చు.

క. దంతిపురనాథ! విను మొక
మంతన మెఱింగింతు శమ దమంబులు నంహో
వంతు శుభవంతుఁ జేయవు
కంతుని గురుభక్తి ముక్తిఁ గలిగించు గతిన్. [6-54]

అయితే ఇందులో ఒక రహస్యం ఉంది విను. శమ దమాది సద్గుణాలు కూడా శ్రీహరి మీద భక్తి చేసినట్టూ పాప, పుణ్యాలని పటాపంచలు చేయలేవు. ఈ పద్యంలో శుకమహర్షి పరీక్షిత్తుని ఏమన్నాడు? “దంతిపురనాథ.” దంతి అంటే ఏనుగు, హస్తి. దంతిపురం అంటే హస్తినాపురం. పరీక్షిత్తు హస్తినాపురానికి రాజు కదా? అందుకే ఆ ప్రయోగం.

సీ. హరికి నర్థముఁ బ్రాణ మర్పితంబుగ నుందు;
వాని కైవల్య మెవ్వనికి లేదు
వనజలోచను భక్తపరుల సేవించిన;
వాని కైవల్య మెవ్వనికి లేదు
వైకుంఠ నిర్మల వ్రతపరుండై నట్టి;
వాని కైవల్య మెవ్వనికి లేదు
సరసిజోదరు కథాశ్రవణ లోలుం డైన;
వాని కైవల్య మెవ్వనికి లేదు [6-55]

తే. లేదు తపముల బ్రహ్మచర్యాది నియతి
శమ దమాదుల సత్యశౌచముల దాన
ధర్మ మఖముల సుస్థిర స్థానమైన
వైష్ణవజ్ఞాన జనిత నిర్వాణపదము. [6-55.1]

ఎవరైతే శ్రీహరికి తన ప్రాణాలనీ అర్థాలనీ అర్పిస్తారో, విష్ణుభక్తులని సేవిస్తారో, విష్ణుకథలు నిరంతరం వింటూంటారో, నిర్మలమైన మనసుతో శ్రీహరిని సేవిస్తారో వారికి లభించే కైవల్యం మరొకరికి లేదు. ఈ కైవల్యం తపమున బ్రహ్మచర్యమున దానమునన్... శమ దమాది వంటి వాటితో దేనితోకూడా రాదు.

తే. అరయ నెన్నఁడుఁ జేటు లేనట్టి ముక్తి
వర్త్మ మీ లోకమందు నెవ్వరికిఁ గలదు?
సాధులును బుణ్యశీలురు సజ్జనులును
హరిపరాయణ తత్పరు లయినఁ గాక. [6-56]

సాధువులు, పుణ్యశీలురు, సజ్జనులు అయిన హరి భక్తి పరాయణులు చేరుకునే మోక్షం మరెవరికీ కలిగే అదృష్టం లేదు. దీనినే యోగులు చెప్పడం ప్రకారం అన్నింటికన్నా సులభమైన మార్గం ఏదంటే, భక్తి యోగం. భగవంతుణ్ణి చేరడానికి అనేకానేక దారులుండొచ్చు కానీ అత్యంత సులభం ఏమిటంటే ఉర్ధి భక్తి ఒక్కటే చాలు.

క. అరుదుగ నరహరి భక్తిం
బొరయని యా పురుషు సుకృత పుంజంబులు వేఁ
మఱుఁ బుణ్యుఁ జేయ నేరవు
నరవర మధుఘటముఁ బెక్కు నదులుం బోలెన్. [6-57]

ఎన్ని పుణ్యాలు చేసినా భగవంతుడి మీద భక్తి లేకపోతే అవన్నీ వ్యర్ధం కిందే లెక్క. ఎన్ని నదులు ప్రవహించినా మద్యం ఉన్న కుండని పవిత్రం చేయలేవు కదా? ఇందులో మరోసారి చెప్పేదేమిటంటే, పాప పుణ్యాలు సమాంతర రేఖలు. వేటికవే అనుభవించాలి. అంటే పాపం మాత్రం మానేసి పుణ్యం ఒకటే చేసినా ముక్తి లభించదు. పాపాలు మాత్రమే చేస్తే ఆ కర్మ అనుభవించినట్టే, చేసిన పుణ్యాలకి సరిపడా కర్మ కూడా అనుభవించాలి. భగవంతుడు త్రిగుణాలకీ పాప పుణ్యాలకీ అతీతుడు కనక ఆయన్ని చేరాలంటే ఈ పాప పుణ్యాలనే సమాంతర రేఖలనీ, ఆ మూడు గుణాలనీ వదుల్చుకోవాలి. ఎందుకంటే భగవంతుడి మీద అనన్యమైన భక్తి తప్ప మిగతావన్నీ బంధనాలు కనక.

చ. సతతముఁ గృష్ణపాదజలజంబుల యందు మనంబు నిల్పు సు
వ్రతులు దదీయ శుద్ధ గుణరాగులుఁ గాలుని యుగ్రపాశ సం
హతుల ధరించు తత్సుభటకౌఘములం గలలోనఁ గాన రే
గతులను దుష్టకర్మములు గైకొని వారలఁ జెందనేర్చునే? [6-58]

నిరంతరం (సతతము) కృష్ణుడి పాద పద్మాలని (జలజము – నీటిలో పుట్టినది, పద్మం) మనసులో తలుచుకునేవారికి యముణ్ణి గానీ, యమ భటులని కానీ కలలోగాని చూడరు. నిరంతరం వారి మనసు నిర్మలంగా ఉండడం వల్ల పాపాలు వాళ్లని చేరలేవు కూడా.

వ. కావున నీ యర్థంబునకుం బురాతనంబగు నొక్క యితిహాసంబు గలదు; అది విష్ణుదూత యమదూత సంవాదం బనంబడు; దాని నెఱింగింతు; ఆకర్ణింపుము. [6-59]

ఇది ఎలా జరుగుతుంది, అసలు జరిగేదేనా అని అడుగుతావేమో, దీనికి పురాతనమైన కథ ఒకటి ఉంది దాన్ని విష్ణు, యమదూతల సంవాదం అంటారు. దీన్ని చెప్తున్నాను అంటూ శుకమహర్షి అజామీళుడి గురించి చెప్పడం మొదలుపెడుతున్నాడు.

ఇప్పటివరకూ జరిగిన కథ చూస్తే శుకమహర్షి ఇదంతా – హరి భక్తి ఒక్కటే చాలు, మోక్షానికి అనడానికి కారణం, పరీక్షిత్తు మరో వారం రోజుల్లో దేహం చాలించబోతున్నాడు. ఇన్నాళ్ళూ ఏయే కర్మలు ఎలా చేసాడో అనవసరం. ఇప్పుడు పోయేటప్పుడు నిరంతరం తన మనసులో భగవంతుడు మెదిలితే చాలు, ఎందుకంటే ఈ తపమున బ్రహ్మచర్యమున దానమునన్... శమ దమాలన్నీ అంతకుముందు కలిగి ఉండకపోతే, ఈ ఒక్క వారం రోజుల్లో జరగకపోవచ్చుకదా? అందువల్ల మిగతావిషయాలన్నీ పక్కనపెట్టి భగవంతుడి మీద ధ్యాస ఉంచు అని శుకమహర్షి పరోక్షంగా చెప్తున్నాడు.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS